క్లుప్తంగా

హస్తకళా ప్రదర్శనకు ఆదరణ



హస్తకళ ప్రదర్శనలో అమ్మకాలు, కొనుగోలు..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రతిరోజూ ఈ ప్రదర్శన ఉదయం 10 గంటలకు ప్రారంభమై.. రాత్రి 9 గంటలకు వరకు కొనసాగుతోంది. ఇక్కడ వివిధ రాష్ట్రాల్లో తయారైన చీరలు, గాజులు, చేనేత వస్త్రాలు, వన్‌గ్రామ్ జ్యువెలరీ, నిత్యావసర వస్తువులు, పాతకంచిపట్టు, బెనారస్, గద్వాల్, వెంకటగిరి చీరలు వివిధ డిజైన్లతో అమ్మకానికి పెట్టారు. వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కొనుగోలుదారులు ప్రదర్శనలో కిటకిటలాడుతున్నారు. రాత్రి పూట సందడిగా కనిపిస్తోంది.

హరోంహర..



పాలేరులో కావడి ప్రదర్శన చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు గ్రామంలో శనివారం కావడి పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కావడి అభిషేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం కావడి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో హరోంహర అంటూ కావడి ప్రదర్శన చేపట్టారు. గ్రామంలో కావళ్లకు పూజలు నిర్వహించారు. భక్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కావడి పండుగను తాము కలసికట్టుగా జరుపుకుంటామన్నారు. తమిళనాడులో ఉన్న తిరుత్తణి సుబ్రమణ్య స్వామి వారికి కావడి మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం



గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రష్మిత

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. శనివారం చామంతిపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు చేశారు. ఇందులో 58 మంది రోగులు పాల్గొన్నారు. మంచానపడిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు హర్షణీయం



సచివాలయ సిబ్బందికి సన్మానం చేస్తున్న అతిథులు

గుడిపాల: సచివాలయ సిబ్బంది సేవలు హర్షణీయమని వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్, ఎంపీటీసీ విజయలక్ష్మిలు తెలిపారు. శనివారం వసంతాపురం సచివాలయంలో మహిళా పోలీస్ పావని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భవిత, వీఆర్‌ఓ శ్రీనాథ్‌రెడ్డి, ఏఎన్‌ఎం సరస్వతి, వెటర్నరీ అసిస్టెంట్ అబ్దుల్లా, వ్యవసాయశాఖ అసిస్టెంట్ సోనియా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

సంక్షేమం లేని గృహాలు

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు.. దుర్భర స్థితిలో ఉంటున్నాయి. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని సంక్షేమ వసతి గృహాలు కనీస వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. పలు చోట్ల వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి. రెండు నియోజకవర్గాల్లో సంక్షేమ వసతి గృహాల దయనీయ స్థితిపై సాక్షి విజిట్ చేసింది.

- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో దయనీయంగా సంక్షేమ హాస్టళ్లు
- కనీస వసతులు, సౌకర్యాలు కరువు
- సరఫరా కాని దుప్పట్లు, కాస్మొటిక్ చార్జీలు
- నామమాత్రంగానే నమోదవుతున్న విద్యార్థుల సంఖ్య
- ప్రభుత్వ హాస్టళ్లలో వసతుల కల్పనపై కూటమి సర్కారు నిర్లక్ష్యం



చిత్తూరులోని బాలాజీ కాలనీ ఎస్సీ బాలురు వసతి గృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు



చిత్తూరు నగరంలోని బాలాజీ కాలనీ ఎస్సీ బాలురు వసతి గృహంలో కంపు కొడుతున్న మరుగుదొడ్లు



సెక్యూరిటీ లేని ఐరాల బాలికల ఎస్సీ వసతి గృహం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని సాంఘిక సంక్షేమ, బీసీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాలు వసతులు లేక కునారిల్లుతున్నాయి. పేరుకు సంక్షేమ హాస్టళ్లే కానీ మచ్చుకైనా సంక్షేమమే కనిపించడం లేదు. శిథిలావస్థకు చేరిన భవనాలు, వర్షం కురిస్తే ఉరుస్తున్న గదులు, తలుపులు లేని మరుగుదొడ్లు, తాగునీటి అసౌకర్యం, నీరు లేని స్నానాల గదులు ఒక్కటేమిటి.. ఇలా సవాలక్ష సమస్యలు హాస్టళ్లల్లో తిష్ట వేశాయి. ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న పేద విద్యార్థులు వసతి గృహాల్లో ఇబ్బందుల నడుమ చదువు కొనసాగిస్తున్నారు.

వసతి కొరవడి..

సంక్షేమ వసతి గృహాలు సంక్షోభంలో పడిపోయాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థుల క్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. హాస్టళ్లల్లో మోటర్లు పనిచేయడం లేదు. ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. మరుగుదొడ్లు, స్నానం గదుల్లో నీటి సౌకర్యం ఉండడం లేదు. హాస్టళ్లలో

చిత్తూరు, పూతలపట్టు సమాచారం	
చిత్తూరు, పూతలపట్టులలో ఎస్సీ బాలుర వసతి గృహాలు	07
ఎస్సీ బాలికల వసతి గృహాల	09
బీసీ బాలుర వసతి గృహాలు	10
బీసీ బాలికల వసతి గృహాలు	12
ట్రైబల్ గురుకుల పాఠశాలలు	02
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	02

ఎంతమంది విద్యార్థులున్నా మరుగుదొడ్లు, స్నానాల గదులు నాలుగైదుకు మించి లేవు. ఉన్న వాటికి నీటి సరఫరా ఉండడం లేదు. కొళాయిలు ఏర్పాటు చేయకపోవడం, డోర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండు నెలలు దాటినా..

సంక్షేమ వసతి గృహాలు ప్రారంభమై రెండు నెలలు పూర్తి కావొస్తోంది. అయితే ఇప్పటి వరకు విద్యార్థులకు దుప్పట్లు, బ్లాంకెట్స్ సరఫరా చేయలేదు. దీంతో గతేదాది ఇచ్చిన దుప్పట్లు చినిగినప్పటికీ వాటినే వినియోగిస్తున్నారు. బ్లాంకెట్స్ లేకపోవడంతో ఇంటి నుంచి విద్యార్థులు చాపలను తెచ్చుకుని వినియోగిస్తున్నారు. అదేవిధంగా కాస్మొటిక్ చార్జీలు సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదు. కిటికీలకు మెష్ లేకపోవడంతో రాత్రి సమయాల్లో విద్యార్థులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. విద్యార్థులకు ప్రతి నెలా వచ్చి వైద్య చికిత్సలు చేయాల్సిన వైద్యులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

> **చిన్నచూపు సరికాదు..**
>
> వసతి గృహాల పట్ల కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరైన పద్ధతి కాదు. పేద విద్యార్థులకు ఇంతవరకు కాస్మొటిక్ చార్జీలు, దుప్పట్లు, బ్లాంకెట్లు ఇవ్వనేలేదు. గతంలో నోటు పుస్తకాలు, ట్రంకుపెట్టెలు ఇచ్చేవారు. ప్రస్తుతం అవికూడా లేదు. వైద్యులైతే వసతి గృహాల వైపే వెళ్లడం లేదు. ప్రభుత్వం, అధికారులు సంక్షేమ వసతి గృహాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి.
>
> – ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, చిత్తూరు జిల్లా.



చిత్తూరు జిల్లా నగరి బాలుర ఎస్సీ వసతి గృహంలో పాత దుప్పట్లను కప్పుకున్న విద్యార్థులు



శిథిలావస్థకు చేరిన బంగారుపాళ్యం గిరిజన గురుకుల పాఠశాల భవనం

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



గుడిపాల: మాట్లాడుతున్న లోకేష్



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు, మాజీ సైనికులు

గుడిపాల: చిన్నప్పటి నుంచే విద్యార్థులు దేశాన్ని గౌరవించాలని సీఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ లోకేష్ అన్నారు. శనివారం సీఎన్ఆర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు దేశమంతా జరుపుకుంటామన్నారు. దేశం కోసం ప్రతి విద్యార్థి ఒక సైనికుడిలా తయారు కావాలన్నారు. ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం పట్ల ప్రేమాభిమానాలను, సౌభ్రాతృత్వ భావాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరులను స్మరించుకుందాం

చిత్తూరు కార్పొరేషన్: కార్గిల్ యుద్ధంలో అశువులు బాసిన అమరుల త్యాగాన్ని స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక అమరవీరుల స్మారక స్థూపం వద్ద కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా 1999 కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల ఆత్మశాంతి కోసం శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాజీ సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, షణ్ముగం, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం పది గంటలకు 23వ డివిజన్ జానకారపల్లె అంబేడ్కర్ విగ్రహం వద్ద, తదుపరి 26వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ రేణుక అపార్ట్‌మెంట్ వద్ద, 25వ డివిజన్ బొండ్‌వీధిలో మొదటి మరాఠావీధి వద్ద సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ వాసులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

వస్తువుల నాణ్యతపై అవగాహన

బంగారుపాళెం: వినియోగదారులు వస్తువుల నాణ్యతా ప్రమాణాలను గుర్తించి కొనుగోలు చేయాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)స్టేట్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ కృష్ణవీర్‌వర్మ తెలిపారు. శనివారం బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స్వయం సహాయక సభ్యులకు బీఐఎస్ విధానాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ వినుతశ్రీ మాట్లాడుతూ మార్కెట్‌లో అనేక రకాల వస్తువులను విక్రయిస్తుంటారన్నారు. ఈ సందర్భంగా కృష్ణవీర్‌వర్మ మాట్లాడుతూ 2015లో భారతదేశంలో కేవలం 2 వేల స్టాండర్డ్స్ మాత్రమే ఉన్నాయని, 2025 నాటికి 23 వేలకు చేరుకుందన్నారు. దేశంలో నాణ్యమైన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడంలో బీఐఎస్ ప్రామాణీకరణ సంఖ్యను 55 వేలకు పెంచడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ యాక్షన్ ఫర్ సోషియల్ సర్వీస్ సంస్థ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వయం సహాయక సభ్యులకు బీఐఎస్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం మండలంలోని ద్వారకాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 45 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ జీవన శైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని, ప్రతి ఒక్కరూ శరీర వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ ప్రియాంక

యాంత్రీకరణ వైపు అడుగులు వేయాలి

గుడిపాల: వ్యవసాయంలో ఆధునీకరణ, యాంత్రీకరణ వైపు రైతులు అడుగులు వేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పిలుపునిచ్చారు. శనివారం శ్రీరంగంపల్లె పంచాయతీలో రాష్ట్రప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా శ్రీరామ రైతు మిత్ర సంఘానికి మంజూరు చేసిన డ్రోన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డ్రోన్‌ను ఎగురవేసి పనితీరును పరిశీలించారు. రూ.9.8 లక్షల విలువైన ఈ డ్రోన్‌ను ప్రభుత్వం 80 శాతం రాయితీతో అందించినట్లు ఏఓ సంగీత తెలిపారు. భవిష్యత్‌లో యాంత్రీకరణ, డ్రోన్‌ల వినియోగం విస్తృతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఈ దిశగా రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.



డ్రోన్ ఎగురవేస్తున్న ఎమ్మెల్యే

భళారే.. కళ



నాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రామాయణ పౌరాణిక నటన భళా అనిపించింది. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శనివారం రాత్రి పౌరాణిక సౌండ్, లైట్ నాటక ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనను రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. రామాయణ పవిత్ర పురాణ ఇతిహాస గాథను, గ్రంథాన్ని దృశ్య రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. కళాకారులు తమదైన శైలిలో నటించి ప్రజలను మెప్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోడి కిశోర్, పార్థసారథినాయుడు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.